క్లుప్తంగా

ఉపాధిహామీని సద్వినియోగం చేసుకోవాలి



కూలీలతో మాట్లాడుతున్న అదనపు పీడీ

ఇల్లంతకుంట: కూలీలందరూ ఉపాధిహామీని సద్వినియోగం చేసుకోవాలని అదనపు డీఆర్డీవో మదన్‌మోహన్ అన్నారు. మండలంలోని జంగంరెడ్డిపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను గురువారం పరిశీలించారు. జాబ్‌కార్డున్న ప్రతి ఒక్కరికి ఉపాధిహామీ పని కల్పించడం జరుగుతుందని, కూలీలకు అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఎప్పటికప్పుడు కూలీలకు కొత్త పనులను గుర్తిస్తూ కూలీలకు పని కల్పించాలన్నారు. కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏపీడీ నర్సింహులు, ఎంపీడీవో మీర్జా, సర్పంచ్ శ్రీలత, ఏపీవో చంద్రయ్య పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ



కూలీలకు ప్యాకెట్లు అందిస్తున్న ఎంపీడీవో

ముస్తాబాద్: ఎండ తీవ్రత తట్టుకునేందుకు ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేసినట్లు ఎంపీడీవో రమాదేవి తెలిపారు. రామలక్ష్మణపల్లెలో కూలీలకు ఉపాధిహామీ పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారికి కల్పిస్తున్న ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ఎండవేడిమిని తట్టుకునేందుకు కూలీలు జాగ్రత్తలు పాటించాలని కోరారు. పనికి తగిన వేతనాలు అందిస్తున్నామన్నారు. ఏపీవో ఆనంద్‌మోహన్, టీఏ రమేశ్ పాల్గొన్నారు.

యాదవుల ఆత్మీయ సమ్మేళన సభకు తరలిరండి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

గంభీరావుపేట: యాదవుల ఆత్మీయ సమ్మేళన సభను విజయవంతం చేయాలని స్థానిక యాదవ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మండల యాదవ సంఘం ముఖ్య నాయకుల సమావేశం గురువారం జరిగింది. మే 28న గంభీరావుపేటలో మండల యాదవుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిపారు. వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో యాదవులు తరలిరావాలని కోరారు. నాయకులు కొక్కు దేవేందర్‌యాదవ్, పెద్దవేని వెంకటి యాదవ్, అగ్గతి రాజు, బొంగు మల్లేశ్, దేవయ్య, మల్లేశం, బాలమల్లు, మహేశ్, కృష్ణమూర్తి యాదవ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

దూరంగా.. అలంకారప్రాయంగా

- ఐదు క్లస్టర్ గ్రామాల్లో రైతు వేదికలు
- సదస్సులకు వెళ్లేందుకు నిరాసక్తత
- నిష్ప్రయోజనంగా భవనాలు
- నిధులున్నా నిర్వహణ లోపం



మర్రిగడ్డ రైతు వేదిక



బండపల్లి రైతువేదిక ఆవరణలో పిచ్చి మొక్కలు

చందుర్తి: సాగులో సమస్యలు వస్తే రైతులు వ్యవసాయాధికారులను కలవాలంటే ఒకప్పుడు మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. దీంతో సమయభావంతో పాటు ఆర్థికభారం అన్నదాతలపై పడేది. రైతులకు ఇబ్బంది కలుగకుండా వ్యయ ప్రయాసలకు లోనుకాకుండా రాష్ట్ర ప్రభుత్వం పంటల సాగు సమావేశాలను ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా గ్రామాలకు అందుబాటులో రైతు వేదికలను నిర్మించింది. కాని వీటి నిర్వహణ లోపంతో కొన్ని క్లస్టర్లలో ఇవి నిరుపయోగంగా మారాయి.

చందుర్తి మండలంలో 19 గ్రామపంచాయతీలు ఉండగా ఐదు క్లస్టర్లలో రైతు వేదికలను నిర్మించింది. చందుర్తి, మూడపల్లి, మర్రిగడ్డ గ్రామాల్లో రైతులకు అందుబాటులో ఉండగా, మల్యాల, బండపల్లి క్లస్టర్లలో వేదికలు ఊరికి దూరంగా నిర్మించారు. ప్రతి క్లస్టర్ పరిధిలో మూడు గ్రామాల నుంచి ఐదు గ్రామాల వరకు ఉన్నాయి. రైతు వేదికల వద్ద మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలమయ్యారు.

కానరాని సమీక్షలు

ప్రతీ ఖరీఫ్, రబీ సీజన్‌లో రైతులు సాగు చేసే విధానాలు, మేలైన విత్తనాలు, సస్య రక్షణ చర్యలు, సాగు విధానాల గురించి రైతులకు అవగాహన కల్పించడం కోసం రైతు వేదికలు నిర్మించారు. నెల నెలా ఈ రైతు వేదికల్లో సంబంధిత అధికారులు సమావేశాలను ఏర్పాటు చేయాలి. కాని ఇప్పటి వరకు ఎలాంటి అవగాహన సదస్సులు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవని రైతులు చెబుతున్నారు. సమావేశాలు ఎప్పుడు జరుగుతున్నాయో కూడా తమకు సమాచారం ఇవ్వడం లేదని అంటున్నారు. సాగుపై సలహాలు, అనుమానాలను నివృత్తి చేసేందుకు ఏఈవోలు అందుబాటులో ఉన్నా, గ్రామానికి దూరంగా ఉన్న వేదికల వద్దకు రైతులు వెళ్లేందుకు నిరాసక్తతను వ్యక్తం చేస్తున్నారు.

నిధులున్నా నిర్వహణ లోపం

ప్రతి రైతు వేదిక నిర్వహణ కోసం నెలకు రూ.9 వేలు చొప్పున ప్రభుత్వం కేటాయిస్తోంది. ఈ నిధులను ఏఈవో ఖాతాల్లో నాలుగైదు నెలకొకసారి ప్రభుత్వం జమ చేస్తోంది. ఈ డబ్బును రైతు వేదికల్లో జరిగే సమావేశాలకు వచ్చే రైతులకు టీ, బిస్కెట్లతో పాటు ఇతర అవసరాలకు వినియోగిస్తారు. అయితే ఈ నిధులున్నా వాటిని ఖర్చు చేసేందుకు నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. సమావేశాలు ఏర్పాటు చేసే సమాచారం లేకపోవడంతో ఒకటి, రెండుసార్లు రైతులు గైర్హాజరు కావడంతో సమావేశాలను ఏర్పాటు చేయాలన్న ఆదేశాలను కూడా సంబంధిత ఏఈవోలు విస్మరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రైతు వేదికలపై సంబంధిత అధికారులు దృష్టిసారించకపోవడంతో అవికాస్తా అలంకారప్రాయంగా మారుతున్నాయి.

రవాణా సౌకర్యం లేదు



మాది ననుగుల గ్రామం, మా క్లస్టర్ గ్రామం బండపల్లి. మా గ్రామానికి బండపల్లి రైతు వేదిక వద్దకు ఏడు కిలోమీటర్లకు పైగానే దూరం ఉంటుంది. ఈ రెండు గ్రామాల మధ్య రవాణా సౌకర్యం లేదు. రైతు వేదికలో వ్యవసాయాధికారులు సమావేశాన్ని ఏర్పాటు చేస్తే వెళ్లేందుకు సొంత వాహనం ఉంటేనే బండపల్లి గ్రామానికి వెళ్లొచ్చు. లేకుంటే అక్కడికి వెళ్లడం కష్టంగా ఉంటుంది.

– బొల్లిపల్లి చిరంజీవి, రైతు, ననుగుల

సమావేశాల సమాచారం లేదు



పంటల సాగుపై ఏర్పాటు చేసే సమీక్ష సమావేశాల సమాచారాన్ని అందించడంలో వ్యవసాయ శాఖ అధికారులు విఫలమవుతున్నారు. కొత్తపేట గ్రామం మల్యాల క్లస్టర్ పరిధిలోకి వస్తుంది. మల్యాల గ్రామానికి వెళ్లాలంటే 12 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సిందే. క్లస్టర్ గ్రామాల్లోనే కాకుండా ప్రతి గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో సాగుపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలి.

– కొలకాని తిరుపతి, రైతు, కొత్తపేట

సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం



రైతు వేదికల్లో శిక్షణ తరగతులను, పంటల సాగులో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం. వ్యవసాయ పనుల్లో ఉంటూ ఆశించిన స్థాయిలో రైతులు సమావేశాలకు హాజరు కావడం లేదు. క్లస్టర్ల పరిధిలో గల రైతులు ఆయా గ్రామాల నుంచి సమావేశాలకు వచ్చేందుకు ఇబ్బంది పడుతున్నారు. అన్ని గ్రామాల్లో పర్యటించి పంటల సాగులో మెళకువలు, సస్యరక్షణ చర్యలను వివరిస్తున్నాం.

– టి. మహేశ్వరి, వ్యవసాయాధికారి, చందుర్తి

ముస్లింలకు 'రంజాన్ తోఫా'



రంజాన్ కిట్లను అందిస్తున్న కౌన్సిలర్ సందీప్

సిరిసిల్లటౌన్: నిరుపేద ముస్లింలకు 34వ వార్డు కౌన్సిలర్ దార్ల సందీప్ రంజాన్ తోఫాను అందించారు.వార్డులోని పదిహేను మంది నిరుపేద ముస్లింలకు 22 రకాల నిత్యావసరాల సరుకులను అందించారు. బీఆర్ఎకు పార్టీకి చెందిన వార్డు పెద్దలు, ముస్లీం మహిళలు పాల్గొన్నారు.

వేములవాడ: వేములవాడ ముస్లింలకు రంజాన్ కానుకలను మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, కౌన్సిలర్లతో కలిసి గురువారం అందజేశారు.బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పుల్కం రాజు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని ముస్లింలకు రంజాన్ కానుకలను గురువారం సర్పంచ్ చల్ల నారాయణ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పుష్పలత, కార్యదర్శి విజయలక్ష్మి, తదుతరులు పాల్గొన్నారు.

రుద్రంగి: స్థానిక మసీదులో ముస్లింలకు ఎంపీపీ గంగం స్వరూపారాణి, జెడ్పీటీసీ గట్ల మీనయ్య రంజాన్ కానుకలను అందజేశారు.

విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ

ఎల్లారెడ్డిపేట: మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఎంపీపీ పిల్లి రేణుక అన్నారు. మండలంలోని సింగారంలో కంటివెలుగు శిబిరాన్ని గురువారం ప్రారంభించిన అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనం రుచిచూశారు కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, సర్పంచ్ నర్సాగౌడ్, ఎంపీటీసీ మధు, నాయకులు పాల్గొన్నారు.

చిత్రకథ



హరితహారం మొక్కలపై గొడ్డలి వేటు

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని పలు గ్రామాల్లో హరితహారం మొక్కలను కొంతమంది యథేచ్ఛగా నరుకుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని నమిలిగుండుపల్లి తదితర గ్రామాల్లో ప్రధాన రోడ్ల పక్కన ఉన్న హరితహారం మొక్కలను కొంతమంది నరికివేస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు పలువురు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారి వివరణ కోరగా తమకు ఎలాంటి సమాచారం లేదని, దానిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటానని తెలిపారు.

విద్యకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట



యూనిఫాం అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

తంగళ్లపల్లి: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోందని ఎంపీపీ పడిగెల మానస, జెడ్పీటీసీ పూర్మాని మంజుల అన్నారు. స్థానిక తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ, ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థినులకు గురువారం యూనిఫాం పంపిణీ చేసి మాట్లాడారు. కళాశాలలో సాధారణ డిగ్రీతోపాటు, ఫైన్ ఆర్ట్స్ కోర్సులను అందించడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఫైన్ ఆర్ట్స్ విద్యార్థినులు రూపొందించిన మోడల్స్‌ను చూసి అభినందించారు. ఇంటర్ విద్యార్థుల మాదిరిగా ట్రైబల్ డిగ్రీ కాలేజీ విద్యార్థినులకు కూడా ట్యాబ్‌లు అందించాలని మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అలాగే బ్యూటీషియన్ కోర్సును కూడా ప్రవేశపెట్టేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కళాశాల కమ్యూనిటీ ఔట్ రీచ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ అంకారపు అనిత, ప్రిన్సిపాల్ కె.రజిని, వైస్‌ప్రిన్సిపాల్ సుధాసింధు, లైబ్రేరియన్ రజిత, అధ్యాపక బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

'బురద రాజకీయాలు మానుకోవాలి'



మాట్లాడుతున్న సిద్ధం వేణు, వెంకటరమణారెడ్డి

ఇల్లంతకుంట: మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌పై కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ బురద రాజకీయాలు మానుకోవాలని జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, ఎంపీపీ వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యం ప్రజా సంక్షేమం కోసం ఎమ్మెల్యే బాలకిషన్ కృషి చేస్తున్నారని, మానకొండూర్ నియోజకవర్గంలో మూడోసారి ఎమ్మెల్యేగా రసమయి గెలుపు ఖాయమన్నారు. ఇది జీర్ణించుకోలేకనే ఎమ్మెల్యేపై కవ్వంపల్లి కుట్ర రాజకీయాలకు తెరతీస్తున్నారన్నారు. కవ్వంపల్లికి త్వరలోనే బీఆర్ఎస్ నాయకులు, ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, ఏఎంసీ చైర్మన్ సంజీవ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చల్ల నారాయణ, తదితరులున్నారు.

చలివేంద్రం ప్రారంభం



సిరిసిల్లటౌన్: ప్రౌడ్ ఆఫ్ జోగాపూర్ విలేజ్ ఆధ్వర్యంలో సిరిసిల్లలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు లగిశెట్టి శ్రీనివాస్ గురువారం ప్రారంభించారు. స్థానిక గోపాల్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు గాజుల నరేశ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, అంజన్న, నరేశ్ పాల్గొన్నారు.

వ్యాపారి ఆత్మహత్యాయత్నం

- రెండు రోజుల క్రితం సంఘటన
- కరీంనగర్‌లో చికిత్స పొందుతున్న వ్యాపారి
- స్టేట్‌మెంట్ రికార్డు చేసిన పోలీసులు



రాంబాబు

సిరిసిల్లక్రైం: వ్యాపారంలో వచ్చిన విభేదాలు, పంపకాల్లో జరిగిన అన్యాయంతో మనస్తాపానికి గురైన వ్యాపారి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన వేములవాడలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు. వేములవాడలో అడ్తి(పత్తి కొనుగోలు) వ్యాపారం చేసుకునే రాంబాబుకు తనతోపాటు మరో వ్యాపారానికి సిద్ధమైన కొందరితో కొన్నాళ్లుగా విభేదాలున్నాయి. దీంతో వాటాల ప్రకారం పంపకాలు చేసుకునేందుకు పెద్దల సమక్షంలో ఒప్పందం కుదిరింది. అయితే రాంబాబు మంచివాడు కాదు అని ప్రచారం చేయడంతోపాటు పంచాయితీ పెద్దల్లో ఒకరు ఒప్పందం కంటే ఎక్కువ డబ్బులు చెల్లించాలని కాగితాలు రాయించుకున్నారు. వ్యాపారంలో ఉన్న గుర్తింపు, ఆర్థికంగా కుంగతీస్తున్న వారితో వేగలేక రెండు రోజుల క్రితం గడ్డిమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. తనకు జరిగిన నష్టానికి కారణమైన వ్యక్తుల గురించి నాలుగు పేజీలు రాసి తాను చనిపోతే కారణం వీళ్లేనని పలువురి పేర్లను ప్రస్తావించారు. అంతేకాకుండా తనకు అన్యాయం చేసిన శ్రీనివాస్‌ను నమ్మవద్దని ఏకంగా ఎమ్మెల్యేకు విన్నవిస్తూ రాసిన లేఖ వేములవాడలో చర్చనీయాంశంగా మారింది. రెండు రోజులుగా కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గురువారం వేములవాడ టౌన్ ఎస్ఐ.. ఆసుపత్రికి వెళ్లి రాంబాబు నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. బాధితుని లేఖను పరిశీలించామని, కుటుంబీకులు ఇప్పటి వరకు ఫిర్యాదు చేయలేదని.. ఫిర్యాదు చేస్తే చట్టపరిధిలో చర్యలు తీసుకుంటామని సీఐ వెంకటేశ్ తెలిపారు.

'అభివృద్ధిని వదిలి ఆత్మీయ సమ్మేళనాలా.?'

కోనరావుపేట: అధికార పార్టీ నాయకులు అభివృద్ధిని మరచి ఆత్మీయ సమ్మేళనాలు చేయడం సరైంది కాదని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా అన్నారు. కోనరావుపేటలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎన్నో వాగ్దానాలు చేసిన ఎమ్మెల్యే రమేశ్‌బాబు మాటల్లో తప్ప అభివృద్ధి చేతల్లో కనిపించడంలేదన్నారు. కోనరావుపేటకు వచ్చిన ప్రతిసారీ కోనసీమగా మారుస్తానని ఏళ్ల నుంచి చెబుతున్నాడన్నారు. నీళ్లు వచ్చింది లేదు, కోనసీమగా మారిందిలేదన్నారు. దళితబంధు నిరుపేద దళితులకు ఇవ్వాల్సి ఉండగా, బీఆర్ఎస్ కార్యకర్తలకు ఇవ్వడం దారుణమన్నారు. మండలంలో ఇప్పటివరకు ఒక్క గ్రామములో ఒక్క డబుల్ బెడ్రూమ్ కూడా కట్టివ్వలేకపోతున్నారన్నారు. ఎంపీ బండి సంజయ్ ఒక్క గ్రామానికి కూడా కనీసం రూ.10 లక్షలు కూడా ఇవ్వలేకపోయారన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు చేపూరి గంగాధర్, ప్రధానకార్యదర్శి గొట్టె రుక్మిణి, జిల్లా నాయకులు నాగండ్ల భూమేశ్, చందనగిరి గోపాల్, కేతిరెడ్డి లక్ష్మారెడ్డి, రవీందర్‌రెడ్డి, కార్తీక్‌గౌడ్, భాస్కర్, కాంతయ్య పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

ముస్తాబాద్: ధాన్యం కొనుగోలు కేంద్రాలను అన్ని గ్రామాల్లో ప్రారంభించి రైతులకు న్యాయం చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా మండల శాఖ అధ్యక్షుడు వరి వెంకటేశ్ డిమాండ్ చేశారు. ఆవునూర్, కొండాపూర్, పోతుగల్, ముస్తాబాద్, నామాపూర్ గ్రామాల్లో ధాన్యం కోతలు చేస్తున్నప్పటికి, కేంద్రాలను ప్రారంభించడం లేదన్నారు.

చెక్కు అందజేత

వేములవాడ: విద్యుత్ షాక్‌తో ప్రమాదవశాత్తు మృతి చెందిన వేములవాడకు చెందిన మురళి కుటుంబానికి సెస్ ద్వారా మంజూరైన రూ. 5 లక్షల చెక్కును ఎమ్మెల్యే రమేశ్‌బాబు అందజేశారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్‌చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ

వీర్నపల్లి: వీర్నపల్లి మండలం భుక్యతండా గ్రామంలో సర్పంచ్ గుగులోత్ భారతి ఆధ్వర్యంలో గురువారం లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం పంపిణీ చేశారు. ఎంపీటీసీ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని దుమాలలో లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను గ్రామ శాఖ అధ్యక్షుడు బట్టు రాజు పంపిణీ చేశారు.

ఈజీఎస్ నిధులు మంజూరు

వీర్నపల్లి: మండలంలోని 17 గ్రామ పంచాయితీలకు సీసీ రోడ్లు, డ్రెయినేజీలకు రూ.72 లక్షలు ఈజీఎస్ కింద మంజూరైనట్లు బీజేపీ మండల అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి తెలిపారు. 16 గ్రామ పంచాయితీలకు రూ.4 లక్షలు, వీర్నపల్లికి సీసీ రోడ్లు, డ్రెయినేజీ, ఓపెన్ జిమ్‌కు రూ.8 లక్షలు మంజూరైనట్లు తెలిపారు.

పేపర్ లీకేజీ కేసును సీబీఐకి అప్పగించాలి

సిరిసిల్లఅర్బన్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసును సీబీఐకి అప్పగించి విచారణ చేపట్టాలని బీఎస్పీ పట్టణాధ్యక్షుడు అన్నల్‌దాస్ భాను డిమాండ్ చేశారు. గురువారం మాట్లాడుతూ లీకేజీలో అసలైన దొంగలను వదిలిపెట్టి దర్యాప్తు చేస్తున్నారన్నారు. పట్టణ ఉపాధ్యక్షుడు రమేశ్, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, నాయకులు భాను, భాస్కర్, పాల్గొన్నారు.

పవర్ కట్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ముస్తాబాద్: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఏఈ మహేశ్ తెలిపారు.

సమాచారం

22 నుంచి గిరిజన గురుకులంలో వేసవి శిబిరాలు

సిరిసిల్లఎడ్యుకేషన్: ఈనెల 22 నుంచి వచ్చే నెల 6 వరకు మండలంలోని ఇందిరమ్మకాలనీ పరిధిలోని గిరిజన గురుకుల బాలికల కళాశాలలో విద్యార్థులకు పలు అంశాలపై వేసవి శిబిరాన్ని నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శకుంతల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మ్యూజికల్ క్యాంపు, లైఫ్ స్కిల్స్, యంగ్ జర్నలిస్టు, పబ్లిక్ స్పీకింగ్ అండ్ యాంకరింగ్‌పై మెలకువలు నేర్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగలవారు కళాశాలలో సంప్రదించాలని తెలిపారు.

పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశాలు

హైదరాబాదులోని బేగంపేట, రామంతాపూర్ పబ్లిక్ స్కూల్‌లో మొదటి తరగతి ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి గంగారాం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు 6 సీట్లు కేటాయింపు కాగా, వాటిలో ఎరుకల (1), లంబాడ(4), ఇతరులకు (1) సీటు ఉన్నట్లు తెలిపారు. జనవరి 1, 2017 నుంచి డిసెంబర్ 31, 2017 మధ్య జన్మించిన షెడ్యూల్డ్ తెగల బాల బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. తల్లిదండ్రుల సంవత్సర ఆదాయం అర్బన్ ఏరియాలో రెండు లక్షలు, రూరల్ ఏరియాలో రూ.లక్ష యాభై వేలు మించరాదని, కుటుంబం నుంచి ఒకరికి మాత్రమే అర్హత ఉంటుందన్నారు. నివాసము, కుల, పుట్టిన తేదీ ధ్రువీకరణపత్రము తహసీల్దారు, మున్సిపాలిటీ నుంచి తీసుకోవాలన్నారు. జిరాక్స్ కాపీలను గెజిటెడ్ అధికారిచే ధ్రువీకరించాలని సూచించారు. దరఖాస్తు ఫారములు కలెక్టరేట్‌లోని గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయము పొందాలన్నారు. ఈ నెల 21 నుంచి 29 సాయంత్రం 5 గంటల వరకు జిరాక్స్ కాపీలతో సమర్పించాలన్నారు. ఎంపిక మే 3న కరీంనగర్ కలెక్టరేట్ గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయ ఆవరణలో జరుగుతుందన్నారు. వివరాలకు 96521 18867లో సంప్రదించాలన్నారు.

పాలిటెక్నిక్ కోర్సుకు..

హైదరాబాద్‌లోని దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా సాంకేతిక శిక్షణ సంస్థలో పాలిటెక్నిక్ కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం ఒక ప్రకటనలో తెలిపారు. అనాథ బాలికలు, తల్లి, తండ్రి కోల్పోయిన బాలికలు, నిరాశ్రయులైన పిల్లలు, చిల్డ్రన్ హెూమ్, మహిళా సంస్థలోని బాలికలు, అక్రమ రవాణాకు గురైన బాలికలు, దివ్యాంగ బాలికలకు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఈ అవకాశం కల్పిస్తున్నట్లు వివరించారు. 70 శాతం సీట్లు వీరికే కేటాయిస్తారని తెలిపారు. సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్, కంప్యూటర్, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సుల్లో 60 సీట్లు చొప్పున్న ఉంటాయని, బాలికలు పాలిటెక్నిక్ అర్హత ప్రవేశ పరీక్ష రాయకున్నా కనీసం పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. కుల, ఆదాయ, తల్లిదండ్రుల మరణ, స్టడీ, టీసీ, ఎస్సెస్సీ ఉత్తీర్ణత ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తుతో జతచేయాలన్నారు. ఫారాలను జర్నలిస్టు కాలనీలోని బాలరక్ష భవన్, సిరిసిల్ల బైపాస్ రోడ్డులోని సఖీ కేంద్రం, కలెక్టరేట్‌లోని జిల్లా సంక్షేమాధికారి కార్యాలయంలో తీసుకోవాలని సూచించారు. వచ్చే నెల 10 సాయంత్రం 4 గంటల వరకు సమర్పించాలని తెలిపారు. వివరాలకు 73965 58651 సంప్రదించాలన్నారు.

కార్యవర్గం

రెడ్డి సంక్షేమ సంఘం

ఎల్లారెడ్డిపేట: స్థానిక చందుపట్ల రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా చందుపట్ల రాజిరెడ్డి గురువారం ఏకగ్రీంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా బాపురెడ్డి, కోశాధికారిగా పద్మారెడ్డి, రైటర్‌గా రవీందర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. సభ్యులు పారిపల్లి రాంరెడ్డి, యమగొండ కిష్టారెడ్డి, రాగుల ఎల్లారెడ్డి, కంది శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

స్వర్ణకారుల సంఘం

ముస్తాబాద్: స్థానిక స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడిగా చింతోజు కిషన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా చేపూరి బ్రహ్మం, ప్రధాన కార్యదర్శిగా వెంగళం సత్యనారాయణ, కోశాధికారిగా చింతోజు అమర్, సహాయ కార్యదర్శిగా చింతోజు రఘు ఎన్నికయ్యారు.